క్లుప్తంగా

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి



గంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైతుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశకు విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని కలెక్టరేట్ కార్యాలయంలో గుంటుపల్లి గ్రామానికి చెందిన రైతులు సమస్యలపై బుధవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుల సమస్యలు కలెక్టర్‌కు సమగ్రంగా వివరించారు. వారి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. అన్నదాతల సమస్యలు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. కూటమి నాయకులలు, రైతులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్, ఆపరేటర్లపై కేసుల నమోదు



తిరువూరు: చౌకధరల దుకాణంలో కార్డుదారులకు అందించాల్సిన నిత్యావసర సరుకులను పక్కదారి పట్టిస్తున్న రేషన్ డీలర్, ఎండీయూ ఆపరేటర్లపై తిరువూరు ఆర్డీఓ మాధురి బుధవారం కేసు నమోదు చేశారు. స్థానిక శాంతినగర్‌లోని రేషన్ డీలర్ సీహెచ్ విజయ, ఎండీయూ ఆపరేటర్ మిద్దె సురేష్‌లు రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. వీరిపై 6–ఎ కేసు నమోదు చేశామని చెప్పారు. తనిఖీలో పీడీఎస్ డీటీ నాగరాజు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



తిరువూరు: తిరువూరు సర్కిల్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. తిరువూరు పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గిరిబాబు, ఆర్ అండ్ బీ ఏఈ గాయత్రి కలిసి ఇబ్రహీంపట్నం–జగదల్‌పూర్ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను బుధవారం గుర్తించారు. వేగ నియంత్రణకు స్టాపర్ బోర్డుల ఏర్పాటు, ఫ్లడ్ లైట్ల నిర్వహణతో ప్రమాదాలను నివారించవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని మునుకుళ్ల, వామకుంట్ల గ్రామాలకు వెళ్లే రహదారులను పరిశీలించారు.

దివ్యాంగుల ఆశ్రమానికి స్వామీజీ విరాళం



తిరువూరు: వృద్ధులు, దివ్యాంగులకు ఆశ్రయమిచ్చిన తిరువూరులోని రమణమహర్షి ఆశ్రమానికి త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి రూ.20 వేల విరాళం అందజేశారు. స్వచ్ఛందంగా ఆపన్నులను ఆదుకుంటున్న రమణమహర్షి ఆశ్రమ నిర్వాహకుడు వెంపాటి అబ్రహంను అభినందించిన స్వామీజీ తక్షణ అవసరాల నిమిత్తం ఈ విరాళాన్ని అందించారు. పట్టణంలోని పరిపూర్ణ సేవా సంస్థను సందర్శించిన జీయర్ స్వామి ఎటువంటి లాభాపేక్ష లేకుండా అనాథ బాలలను ఆదుకుంటున్న నిర్వాహకుడు సిరికొండ నాగేశ్వరరావును అభినందించారు. వారి అభ్యున్నతికి తనవంతు సహాయం అందిస్తానని చెప్పారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం



తిరువూరు: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతూ జాతీయ స్థాయి స్పైక్ మార్షల్ ఆర్ట్స్‌కు ఎంపికైన బక్కా కావ్యశ్రీకి పూర్వ విద్యార్థుల సంఘం (దోస్త్) బుధవారం ఆర్థిక సాయం అందజేసింది. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కావ్యశ్రీకి ఈ నెల 7,8,9 తేదీల్లో హర్యానాలో జరిగే పోటీలకు వెళ్లే ఖర్చులను దోస్త్ సభ్యులు అందజేశారు. కావ్యశ్రీకి శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయిని సుకన్యను దోస్త్ సభ్యులు కొసరాజు కృష్ణసాయి, చిత్తలూరి సోమశేఖర్, పరసా నెహ్రూజీ, రవిశంకర్ తదితరులు అభినందించారు.

బయటకు రావాలంటేనే

బెంబేలు

- వీధుల్లో గుంపులు గుంపులుగా శునకాల సంచారం
- వాహనదారులు, పాదచారుల వెంట పడి దాడులు
- నియంత్రణ చర్యలు చేపట్టని మున్సిపల్ అధికారులు
- భయాందోళనలో పట్టణ వాసులు

నూజివీడు: నూజివీడు పట్టణంలో ఏ వీధిలో చూసినా శునకాలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ పాదచారులు, ద్విచక్ర వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. పట్టణంలో దాదాపు 1,500 పైగా వీధి కుక్కలు వీధుల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. పట్టణంలో 32 వార్డులు ఉండగా 4,5,7 వార్డుల్లోనే అధిక సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి. బంగినపల్లి తోట, గాంధీనగర్, ఎమ్మార్ అప్పారావు కాలనీ, అమ్మవారి తోట, బాపూనగర్, అజరయ్యపేట, ఢంఢం గార్డెన్ తదితర ప్రాంతాల్లోనూ కుక్కల సంఖ్య అధికంగా ఉంది. ఇవి గుంపులుగా సంచరిస్తుండటంతో మహిళలు, పిల్లలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి సమయంలో, ఉదయాన్నే ట్యూషన్‌కు వెళ్లి వచ్చే పిల్లల వెంట పడి దాడి చేస్తున్నాయి. వీధి కుక్కలకు తోడు ఈనిన కుక్కలు అయితే ద్విచక్ర వాహనదారులు వెళ్తుంటే వారి వెంట పరుగులు పెడుతూ ఆందోళనకు గురి చేస్తున్నాయి. దీంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కుక్కల సమస్యను మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో కౌన్సిలర్లు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారు స్పందించిన దాఖలాలు కనిపించడం లేదు.



నూజివీడులోని ఏడో వార్డులో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్స ఊసే లేదు..

పెంపుడు జంతువుల సంరక్షణ చట్టం ప్రకారం కుక్కలను చంపడానికి వీల్లేదు. వీధి కుక్కల సంఖ్య పెరగకుండా, వాటికి సంతానోత్పత్తి నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించి, అవి ఏ ప్రాంతంలో ఉన్నాయో అక్కడే వదలాలి. కనీసం శస్త్రచికిత్సలు చేయించేందుకు కూడా మున్సిపల్ అధికారులు ముందుకు రావడం లేదు. దీనికి తోడు కొందరు జంతు ప్రేమికులు చికెన్ సెంటర్ల వద్ద ఉండే కోళ్ల వ్యర్థాలను తీసుకువచ్చి వండి కుక్కలకు వేస్తుండటంతో వాటి సంఖ్య మరింత పెరుగుతోంది. పట్టణంలోని రామాయమ్మరావుపేటలో ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు కొట్టేస్తే మరమ్మతులు చేసేందుకు వెళ్లిన జేఎల్‌ఎంను కుక్క వచ్చి కరిచింది.

కుక్కల అరుపులతో నిద్ర కరవు



పట్టణంలో కుక్కల బెడద చాలా అధికంగా ఉంది. రాత్రి సమయంలో అయితే పడుకోనివ్వకుండా అరుస్తూనే ఉంటున్నాయి. ద్విచక్ర వాహనాలకు అకస్మాత్తుగా అడ్డం వస్తుండటంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. పార్కుల వద్ద కుక్కలు గుంపులుగా ఉంటూ లోపలికి వెళ్లి వచ్చే వారి వెంట పడుతున్నాయి.

– మహమ్మద్ సుభాని, ఎంప్లాయీస్ కాలనీ, నూజివీడు

వెంట పడి దాడి చేస్తున్నాయి



ఇటీవల కుక్కల బెడద పెరిగిపోయింది. మోటార్ సైకిల్‌పై వెళ్తుంటే వెంట పడుతున్నాయి. దీంతో వాహన చోదకులతోపాటు వెనుక కూర్చున్న వృద్ధులు, మహిళలు కింద పడిపోతున్నారు. పిచ్చికుక్క ఏదో, వీధి కుక్క ఏదో కూడా తెలియడం లేదు. కుక్కలను పట్టుకుని దూర ప్రాంతాల్లో వదిలేయాలి.

– లాం అభినేష్, అజరయ్యపేట, నూజివీడు

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

నూజివీడు: మండలంలో ఈనెల 6వ తేదీ నుంచి జనవరి 8 వరకు భూ వివాదాలు, సమస్యలపై గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ బీవీ సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో తహసీల్దార్, ఆర్ఐ, మండల సర్వేయర్, వీఆర్వో, రిజిస్ట్రేషన్ శాఖ ప్రతినిధి, అటవీ శాఖ, దేవదాయశాఖాధికారులతో కూడిన బృందం పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తుందన్నారు. ఈనెల 6న యనమదల, 7న బత్తులవారిగూడెం, 10న మీర్జాపురం, 11న తుక్కులూరు, 12న సుంకొల్లు, 13న పడమర దిగవల్లి, తూర్పు దిగవల్లి, 16న నూజివీడు, 17న వెంకటాయపాలెం, 18న ముక్కొల్లుపాడు, 19న అన్నవరం, 20న జంగంగూడెం, 21న పోతురెడ్డిపల్లి, 23న పల్లెర్లమూడి, 24న హనుమంతులగూడెం, 26 నర్సపేట, 27న రామన్నగూడెం, 28న మర్రిబంధం, 30న సీతారామపురం, 31న ఎంఎన్‌పాలెం, 2న వేంపాడు, గొల్లపల్లి, 3న దేవరగుంట, 4న పోలసానపల్లి, 6న బోర్వంచ, 7న మొర్సపూడి, 8న పాతరావిచర్ల, కొత్త రావిచర్లలో రెవెన్యూ సభలు నిర్వహిస్తామని వివరించారు.

- **విస్సన్నపేట:** మండలంలో ఈ నెల ఆరో తేదీ నుంచి 31వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి బుధవారం తెలిపారు. ఆరో తేదీన కొండపర్వ గ్రామ సచివాలయం వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సభ జరుగుతుందని చెప్పారు.

అభివృద్ధి పనులకు అడ్డంకులు తగదు

చాట్రాయి: అభివృద్ధి పనులకు అధికారులు ఆటంకాలు సృష్టించడం తగదని పలువురు పేర్కొన్నారు. మండలంలోని చిన్నంపేట, పర్వతాపురం, చిత్తపూరు, ఆరుగొలనుపేటలో గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం మండల పరిషత్ నిధులు ఒక్కొక్క గ్రామానికి రూ.3 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిర్మాణాలకు మండల పరిషత్, ఆయా గ్రామ పంచాయతీల తీర్మానాలతో పాటు పంచాయతీరాజ్ శాఖ అనుమతులు కూడా ఇచ్చారు. ఈ పనుల నిమిత్తం గ్రావెల్ తోలుకునేందుకు అనుమతులు ఇవ్వాలని తహసీల్దార్ ప్రశాంతిని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు కోరారు. దీనికి తహసీల్దార్ నిరాకరించి గ్రావెల్ కోసం మంత్రి పార్థసారథిని కలిసి అనుమతులు తీసుకోవాలని చెప్పారని ప్రజాప్రతినిధులు తెలిపారు. గతంలో పలు గ్రామాల్లో గ్రావెల్ తరలింపునకు తహసీల్దార్ అనుమతులు ఏవిధంగా ఇచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు. గ్రావెల్ తరలింపునకు మంత్రి అనుమతి కావాలని అనలేదని, మైనింగ్ శాఖాధికారుల అనుమతి తీసుకోవాలని సూచించినట్లు తహసీల్దార్ తెలిపారు. తక్కువ స్థాయిలో గ్రావెల్ తరలింపునకు మాత్రమే అనుమతులు ఇస్తానని తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు.

పేదల ఇళ్లకు పట్టాలు ఇవ్వాలి: సీపీఎం

నూజివీడు: 10, 15 వార్డుల్లోని పేదలకు ప్రభుత్వం తక్షణమే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు డిమాండ్ చేశారు. పేదలతో కలిసి ఆయా వార్డు సచివాలయాల్లో బుధవారం అర్జీలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ మొఘల్ చెరువు లోపలి ప్రాంతంలో 200 కుటుంబాలు 60 ఏళ్లుగా నివాసముంటున్నారని, ఏళ్లు గడుస్తున్నా వారి సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా వారు ఉంటున్న నివాస స్థలాలకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఎన్టీఆర్ కాలనీలో 22 కుటుంబాల వారు 20 ఏళ్లుగా నివసిస్తున్నా వారి స్థలాలకు పట్టాలు లేవని, వారికి కూడా నివేశన స్థల పట్టాలు ఇవ్వాలన్నారు. సీసీ డ్రెయినేజీలు నిర్మించడంతో పాటు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్ఆర్ హనుమాన్లు, కార్యకర్తలు, పేదలు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటం

మైలవరం: ప్రజా వ్యతిరేక పాలనపై కూటమి ప్రభుత్వంపై పోరాడతామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 11న రైతుల సమస్యలపై కలెక్టర్ కార్యాలయాల వద్ద మెమోరాండా అందజేస్తామన్నారు. ఈనెల 27న విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఎస్పీ, సీఎండీ విద్యుత్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని, జనవరి 3న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి, విద్యా దీవెన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని వివరించారు.

సామర్థ్యాభివృద్ధి సాధించాలి

చాట్రాయి: విద్యార్థులు సామర్థ్యాభివృద్ధి సాధించే దిశగా కృషి చేయాలని ఎంఈఓ బ్రహ్మాచారి అన్నారు. చాట్రాయి జెడ్పీ హైస్కూల్‌లో సమగ్రాభివృద్ధి, జ్ఞాన విశ్లేషణపై విద్యార్థులకు నిర్వహించిన పరీక్షా కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన మర్లపాలెం జెడ్పీ హైస్కూల్‌కి చెందిన 25 మంది, చనుబండ ఉషోదయ హైస్కూల్‌కి చెందిన 30 మంది 3,6,9 తరగతులకు చెందిన విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో ఫీల్డ్ అబ్జర్వర్లు పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు 851 అర్జీలు

ఆగిరిపల్లి: స్థానిక పొన్నం కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుంచి వివిధ సమస్యలపై బుధవారం 851 అర్జీలు వచ్చాయని ఏఓ అబ్దుల్ సలాం తెలిపారు. వీటిలో అత్యధికంగా రెవెన్యూ సమస్యలపై 568, పింఛన్లు కోసం 205, ఇతర సమస్యలపై 78 అర్జీలు అందాయని చెప్పారు. ఈఓపీఆర్డీ ఆనంద్ బాబు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



రామచంద్రాపురం(విస్సన్నపేట): నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టామని విద్యుత్ శాఖ ఏఈ విజయభాస్కర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కలగర పంచాయతీ రామచంద్రాపురంలో వ్యవసాయానికి వినియోగించే 11 కేవీ కలగర అగ్రికల్చర్ ఫీడర్‌ను రెండుగా విడగొట్టామని చెప్పారు. 354 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు ఒకే ఫీడర్‌పై ఉండటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని చెప్పారు. కొత్తగా చార్జి చేసిన 11 కేవీ లక్ష్మీపురం ఫీడర్ మీదుగా 215 ట్రాన్స్‌ఫార్మర్ మళ్లించడం ద్వారా భారం తగ్గిందన్నారు.

కందులపాడులో పశు వైద్యశిబిరం

మైలవరం: పశువులకు సంక్రమించే సీజనల్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్య డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెస్లి అన్నారు. మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండలం కందులపాడు, చేగిరెడ్డిపాడు గ్రామాలలో శ్రీపుట్టపర్తి సత్యసాయి సేవా సంస్థ విజయవాడలోని సీతారామపురం వారి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 36 జీవాలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి. హరిహరన్, మైలవరం పశువైద్యాధికారి జి. విజయమోహన్, డాక్టర్ పీఎస్‌వీ మురళీకృష్ణారెడ్డి, డాక్టర్ శైలజ, శ్రీసత్య సాయి సంస్థల జిల్లా ప్రెసిడెంట్ బీవీఎస్‌టీ సాయి పాల్గొన్నారు.

'సారథి మన వారధి'కి 1,731 అర్జీలు

నూజివీడు: రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు నూజివీడు మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో వివిధ సమస్యలపై 1,731 అర్జీలు వచ్చాయి. వీటిల్లో ఎక్కువ అర్జీలు గృహాలు మంజూరు చేయాలని, నివేశన స్థలాలు ఇవ్వాలని, పింఛన్లు మంజూరు చేయాలని, రేషన్‌కార్డులు ఇవ్వాలని ప్రజలు అర్జీలు అందజేశారు. ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ పర్యవేక్షించగా, ఎంపీపీ ఆరేపల్లి శిరీష పరిశీలించారు. రెవెన్యూ శాఖకు సంబంధించినవి 869 అర్జీలు, పంచాయతీరాజ్‌కు సంబంధించినవి 524 అర్జీలు, గృహ నిర్మాణ శాఖకు సంబంధించినవి 327, ఏపీ ట్రాన్స్‌కోకు సంబంధించినవి 11 అర్జీలు ఉన్నాయి. వీటిని పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపారు.

రేషన్ దుకాణాల తనిఖీ

విస్సన్నపేట: స్థానిక రేషన్ దుకాణాలను పీడీఎస్ డీటీ బి. శివనాగరాజు మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. ఒకటో నంబర్ షాపులో 69 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం అధికంగా ఉన్నట్లు గుర్తించి రేషన్ డీలర్ ఆకుల శ్రీనివాసరావుపై 6(ఎ) కేసు నమోదు చేశారు. షాపు నెంబర్ 2లో తనిఖీ చేయగా 9.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. రేషన్ డీలర్ నాగమణిపై 6(ఎ) కేసు నమోదు చేశారు. అధికంగా గుర్తించిన బియ్యాన్ని వేరే డీలర్ల వద్ద భద్రపరిచారు. వీఆర్ఓ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక అజ్మీర్ దర్గా

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): 850 ఏళ్ల చరిత్ర కలిగిన అజ్మీర్ దర్గాను వివాదాస్పదం చేయటం ద్వారా ముస్లింల మనోభావాలు దెబ్బతిన్నాయని అహలే సున్నత్ జమాత్ రాష్ట్ర కో కన్వీనర్ అల్తాఫ్ రజా అన్నారు. అజ్మీర్ దర్గా మత సామరస్యానికి ప్రతీక అని చెప్పారు. కొంతమంది దుష్టశక్తులు దర్గాల కింద శివలింగాలు ఉన్నాయని ప్రచారం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కొండపల్లి షాబూఖారీ మసీదు వద్ద బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ శివలింగాల పేరుతో వివాదాలు చేయొద్దన్నారని గుర్తుచేశారు. ప్రశాంతమైన భారతదేశంలో రోజుకో వివాదంతో ముందుకు వెళుతున్న అరాచక శక్తులను నిలువరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

నిందితుల బైండోవర్

మైలవరం: ఎక్సైజ్, ప్రొహిబిషన్ మైలవరం సర్కిల్ పరిధిలో సారా కేసుల్లో పాత నిందితులను రెడ్డిగూడెం తహసీల్దార్ ఎదుట హాజరు పరిచామని ఎక్సైజ్ సీఐ జోశ్యుల శ్రీనివాస్ బుధవారం తెలిపారు. రెడ్డిగూడెం మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన పరికెల కోటేశ్వరరావు, వేముల మసయ్య, రుద్రవరం గ్రామానికి చెందిన దారావత్ రాణిలను అదుపులోకి తీసుకుని రెడ్డిగూడెం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని చెప్పారు.

7న ఎస్ఎంసీ సమావేశం

ముసునూరు: ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం ఈ నెల 7వ తేదీన రమణక్కపేట జెడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తామని ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారావు తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థులతో కలిసి తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. ఈ సమావేశాన్ని పురస్కరించుకుని విద్యార్థులు స్వయంగా గ్రీటింగ్ కార్డులు, ఆహ్వాన పత్రికలు తయారుచేశారు. పాఠశాలలో హెచ్ఎం రామకృష్ణారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ముందస్తు ఎస్ఎంసీ సమావేశంలో వీటిని ప్రదర్శించడంతోపాటు, తల్లిదండ్రులకు చిన్నారులు స్వయంగా ఆహ్వానం పలికారు. అనంతరం గ్రామంలోని పెద్దలు, పాఠశాల దాతలు, పూర్వ విద్యార్థులు, ఎస్ఎంసీ సభ్యులకు, తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రికలు అందించారు.

రాష్ట్రానికి రోశయ్య సేవలు అమూల్యం

వర్ధంతి కార్యక్రమంలో వక్తల నివాళి



మైలవరంలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

మైలవరం: రాష్ట్ర ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా కొణిజేటి రోశయ్య అమూల్యమైన సేవలు అందించారని, ఆయన సేవలను అధికారం పక్షంతోపాటు ప్రతిపక్షాలు సైతం ప్రశంసించాయని ఆర్యవైశ్య సంఘం మైలవరం మండలం అధ్యక్షుడు బయన శ్రీనివాసరావు అన్నారు. రోశయ్య వర్ధంతి కార్యక్రమం మైలవరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ రోశయ్య ఎటువంటి సమస్యనైనా సులువుగా పరిష్కరించేవారని, ఆవిధంగా ప్రజల మన్ననలు పొందారన్నారు. సంఘం కార్యదర్శి కాజా మహేష్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ చారుగుళ్ళ ప్రసాద్, చలువాది మధు, జూలకంటి ప్రసాద్, అనుమోలు గాంధీ, జగన్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా యోజన వినియోగించుకోండి

చిలుకూరు(ఇబ్రహీంపట్నం): ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.శైలజ అన్నారు. గుంటుపల్లి, చిలుకూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. రబీసాగులో మొక్కజొన్న, వరి, శనగ తదితర పంటలు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పంట పొలాలకు నమోదు చేసుకోవాలన్నారు. వరి, మొక్కజొన్నకు ఎకరాకు రూ.126, శనగపంటకు ఎకరాకు రూ.56 చొప్పున కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో చెల్లించి ఫసల్ బీమా యోజన నమోదు చేయించుకోవచ్చని చెప్పారు. మొక్కజొన్న, శనగపంటకు బీమా చెల్లింపు తేదీ డిసెంబర్ 15, వరికి డిసెంబర్ 31వరకు ఉందన్నారు.

పంటల బీమా చేయించండి

మైలవరం: రైతులందరూ తప్పనిసరిగా పంటల బీమా చేయించాలని మండల వ్యవసాయాధికారి సంధ్యారాణి బుధవారం తెలిపారు. క్రాప్ ఇన్సూరెన్స్‌కు ఆధార్ కార్డు, పొలం పాస్‌బుక్ జిరాక్స్, రైతు సేవా కేంద్రంలో ఇచ్చే క్రాప్ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్, రైతు ఫోన్ నంబర్‌ను సమీపంలోని మీ సేవా కేంద్రాల్లో, సీఎస్‌సీ సెంటర్‌లో గాని రైతులు అందజేసి పంటలకు బీమా చేయించుకోవాలని చెప్పారు. కౌలు రైతులకు కూడా పీఎం ఫసల్ బీమా యోజనకు అర్హులన్నారు. కౌలు కార్డు తప్పని సరిగా ఉండాలని చెప్పారు.

- **తిరువూరురూరల్:** రబీలో సాగుచేసే పంటలకు పసల్ బీమా యోజన కింద పంటల బీమా తప్పక చేయించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ టి. మాధవీలత అన్నారు. రైతు శిక్షణా కేంద్రాల సిబ్బందికి తిరువూరు వెలుగు కార్యాలయంలో బుధవారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అన్ని కామన్ సర్వీస్ సెంటర్లలో రబీ పంటల బీమా ఆన్‌లైన్లో నమోదు చేసుకోవచ్చన్నారు. ఏడీఏ కెనడీ, వ్యవసాయాధికారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

అమర గాయకుడు ఘంటసాల

తిరువూరు: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి కార్యక్రమం తిరువూరు శాంతి నగర్‌లో ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి అసోసియేషన్ అధ్యక్షుడు వాణీ రంగారావు, పలువురు కళాకారులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గాత్ర కచేరీ నిర్వహించారు.

- **పెనుగొలను(గంపలగూడెం):** పెనుగొలను ప్రాథమిక ఎలిమెంటరీ పాఠశాలలో షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో ఘంటసాల చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. రవికుమార్, సాయిబాబా సేవా కమిటీ సభ్యులు వి. వెంకటరెడ్డి, వి. యజ్ఞకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- **నూజివీడు:** ఘంటసాల జయంతిని బుధవారం నూజివీడులో సత్య నృత్య సంగీత అకాడమీలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అకాడమీ నిర్వాహకులు వేంపాటి మోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఘంటసాల అభిమానులు, ఔత్సాహిక గాయకులు ఘంటసాల మధుర గీతాలను ఆలపించారు. సంగీత విద్యార్థులకు పుర ప్రముఖులతో ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆడిటర్ కె. రామచంద్రమూర్తి, కోట శివ శాస్త్రి, పురాణం కృష్ణప్రసాద్, గాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చెట్లను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ఈనెల 5న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీసీపీడీసీఎల్ ఈఈ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని తాతయ్యబాబు ఆస్పత్రి వెనుక ప్రాంతం, రజకపేట, భువనగిరిపేట, పెద్ద చెరువు ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఇబ్రహీంపట్నం: ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ సంక్షేమ సంఘం ఏపీ జెన్‌కో నూతన పాలకవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. ఇబ్రహీంపట్నం సంఘ కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ కిరణ్ అధ్యక్షతన జరిగిన ఎన్నికలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విద్యుత్ కేంద్రాలకు చెందిన సంఘ కార్యవర్గ సభ్యులు ఎన్నికలో పాల్గొన్నారు. జెన్‌కో యూనిట్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్. సిద్దయ్య, ఎం.అమర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల కాలంలో పదవీ విరమణ చేసిన అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాబురావు స్థానంలో వై.కళ్యాణ్ కుమార్‌ను నూతన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. నూతన సభ్యులకు అభినందనలు తెలిపారు.

800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

చాట్రాయి: సారా తయారీ కేంద్రాలపై దాడి చేసి 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు మాట్లాడుతూ మండలంలోని పోలవరంలో సారా తయారు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేశారు. 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి తయారీదారుడు పిల్లి దుర్గాప్రసాదుపై కేసు నమోదు చేశారు. బెల్లపు ఊట ఉన్న భూమి యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

జమీందారి భూములకు పట్టాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు అర్జీలు అందజేస్తున్న ఆరుగొలనుపేట రైతులు

చాట్రాయి: అటవీ భూములుగా నమోదైన జమీందారి భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ మండలంలోని ఆరుగొలనుపేటకు చెందిన రైతులు తహసీల్దార్ ప్రశాంతికి అర్జీలు అందజేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో రైతులు ఈ మేరకు అర్జీలు అందజేశారు. రెండో రోజున బుధవారం 94 అర్జీలు వచ్చాయని, వీటిలో 57 అర్జీలు రెవెన్యూ శాఖకు సంబంధించినవని, మిగిలినవి ఆయా శాఖలకు సంబంధించినవని తహసీల్దార్ తెలిపారు.

నిబంధనలు పాటించాలి



తనిఖీ చేసి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

విస్సన్నపేట: వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు నంబర్లు లేకుండా నడిపితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలపై యువకులకు అవగాహన కల్పించారు.